

# ప్రేమించే హృదయాలు

**సాయపన్న**

కళ్యాణి హైదరాబాద్ స్టేషన్లో రైలుదిగి తన స్నేహితురాలు సుందరికోసం దిక్కులు చూడనారంభించింది. అదే సమయానికి మరి రెండు రైళ్ళువచ్చి ఎదురుగావున్న ప్లాటుఫారంమీద ఆగటం వల్ల, జనంరద్దీ ఎక్కువగా వుంది

ఆ రద్దీలో సుందరి వచ్చిందో లేదో తెలుసుకోవటంకూడా కష్టమే అనిపించింది కళ్యాణికి.

ఆమె హైదరాబాద్‌కి రావటం అదే మొదలు అవటంవల్ల, తన ఉత్తరం అందకగానీ, మరే ఇతర కారణంవల్లగానీ సుందరి తనను తీసుకువెళ్ళటానికి గనుక స్టేషన్‌కి రాకపోతే ఏం చెయ్యాలో ఆమెకు తోచిందికాదు. ఆమెకు తోచిందల్లా వొక్క భయపడటమే.

కళ్యాణిభర్త వొక యం.బి.బి.యస్. డాక్టరు. అతనిపేరు విశ్వేశ్వరరావు. గత పదిరోజులవరకూ నూజివీడులో గవర్నమెంట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తూ వుండేవాడు. ఇటీవలే ఆయనకు హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. ట్రాన్స్‌ఫర్ అవగానే అతను హైదరాబాద్ వచ్చి, వొక వారంరోజులు వుండి, ఇల్లు మాట్లాడుకొని తిరిగి నూజివీడు వెళ్ళాడు. అతనూ కళ్యాణీ కలిసి హైదరాబాద్ వద్దామని వారు అనుకున్నారుగాని, తీరా బయలుదేరవలసిన కాలం సమీపించేటప్పటికి ఆలా జరుగలేదు. అతనికి అర్జంట్ పనితగిలి ఆగిపోవలసి వచ్చింది.

"నువ్వువెళ్ళి ఇల్లూ గిల్లూ శుభ్రం చేయించి వుంచు. నేను పనిపూర్తి చేసుకొని వస్తాను," అన్నాడు విశ్వేశ్వరరావు,

ఆమె అంగీకరించింది. మామూలు ధోరణితో అయితే, వొంటరిగా హైదరాబాద్ వెళ్ళటానికి ఆమె సాహసించి వుండేదికాదు. ఆమె అవటం డాక్టరు భార్యే అయినా, ప్రస్తుతం వుండటం నూజీవీడు లోనేఅయినా, పుట్టి పెరిగింది పల్లెటూళ్ళో అవటంవల్ల పట్టణంలో అడుగుపెట్టడం అంటే ఆమెకు ఏదో మనస్సులో పీకుతూ వుండేది. తప్పిపోతే దారి అడగటం మొదలుకొని,

బస్సులో కండక్టర్ని టిక్కెట్టు అడగటం వరకూ ఆమెకు అన్నీ పెద్ద సమస్యలు గానే వుండేవి.

అటువంటి కళ్యాణిభర్త హైదరాబాద్ వెళ్ళమనగానే అంగీకరించటానికి కారణం సుందరి.

సుందరీ కళ్యాణీ చిన్నప్పుడు హైస్కూల్లో కలిసి చదువుకున్నారు. తరువాత కళ్యాణి చదువు మానివేసింది. సుందరి బి.ఏ ప్యాసయి, ఉద్యోగంచేస్తూ, వొక పెద్ద ఉద్యోగస్తుణ్ని వివాహమాడి హైదరాబాద్‌లో హాయిగా జీవయాత్ర సాగిస్తూ వుందని కళ్యాణికి ఇటీవలే తెలిసింది

ఆ సుందరి హైదరాబాద్‌లో కనుపించిందనీ, తనను రమ్మనమని ఆహ్వానించిందనీ తనభర్త చెప్పినప్పుడు,కళ్యాణి హృదయం ఆనందాతిరేకంతో రెపరెప కొట్టుకుంది చిన్ననాటి స్నేహితురాల్ని చూడవచ్చనే ఆరాటంకొద్దీ, పట్టణం అంటే సహజంగా తనకున్న భయాన్ని తగ్గించుకొని ఆమె బయలుదేరింది.

రైలు హైదరాబాద్ స్టేషన్లో అడుగు పెట్టేవరకూ ఆమె మనస్సు బాగానే వుంది ఆలా అడుగుపెట్టడంతో పట్టణంఅంటే సహజంగా వుండే భయం మళ్ళీ ఆమెను ఆవహించింది. జనం రద్దీతో, ఆ జనంలో సుందరి కనపడక పోవటంతో, ఆ భయం ఇట్టే రెచ్చిపోయింది

"ఏమిటి కళ్యాణీ చూస్తువున్నావు?" అనే ప్రశ్న ఎక్కడనుంచో మెరపులాగా వొచ్చి ఆమె మీద వాలింది.

ఎవరది? ఉలిక్కిపడి పక్కకుచూచింది కళ్యాణి. పక్కన సన్నగా, నాజూగ్గా చిరునవ్వు నవ్వుతూ నుంచొనివున్న వొక స్త్రీ కనుపించింది. ఆమె ఎవ్వరా అనే ఆలోచనకు అవకాశం లేకుండానే, "నన్ను గుర్తుపట్టలేదా కళ్యాణీ?" అని నవ్వుతూ అడిగింది ఆమె.

"గుర్తుపట్టకపోవడం ఏమిటి?" అని ముందుగా అనాలోచితంగా అనేసింది కళ్యాణి. ఆలోచించాక వెంటనే ఆమెకు స్ఫురణకు వచ్చింది. "నువ్వు సుందరివి కావూ?"

"అవునవును" అన్నది సుందరి. ఆమాట ఆమె ఏదో యదాలాపంగా అన్నదేగాని, సంతోషంగా అనలేదు.

"చాలా మారిపోయావు సుందరీ" అన్నది కళ్యాణి.

"మంచికా చెడుకా?" అని అడిగింది సుందరి.

"మంచికే," అన్నది కళ్యాణి.

"సరిసరి. పద ఇంటికి వెళ్దాం" అన్నది సుందరి.

ఇద్దరూ సామానుకూలివానికి అప్పగించి స్టేషన్‌బయటకు నడిచారు

* * *

సుందరి భర్తపేరు జయరామారావు.

జయరామారావు హైదరాబాదులోనే ఒక పెద్ద ఫ్యాక్టరీలో మేనేజరుగా పని చేస్తున్నాడు. అతని పూర్వీకులు సర్కారు జిల్లావాళ్ళే. అతని తల్లిదండ్రులుమాత్రం అక్కడ గడవక ఆంధ్రరాష్ట్ర స్థాపనకు పూర్వమే ఎప్పుడో వచ్చి స్థిరనివాస మేర్పరచుకొన్నారు. అందువల్ల జయరామారావు ఇంచుమించు హైదరాబాదులోనే పెరిగాడని చెప్పవచ్చు. అక్కడ విద్యాభ్యాసం సంపూర్తి చేసుకొని ఒక జాగీర్‌దారు ప్రాపకం సంపాదించి అమెరికా వెళ్ళి అక్కడ వ్యాపారానికి సంబంధించిన ఒక పెద్ద డిగ్రీ పొంది వచ్చాడు. వచ్చీరాగానే ఇప్పుడు పని చేస్తున్న ఫ్యాక్టరీలోనే మేనేజరుగా నియమింపబడ్డాడు.

ఈ సంగతులన్నీ కళ్యాణికి ఆమెభర్త విశ్వేశ్వరరావు చెప్పగా తెలిశాయి అయితే సుందరికి, అతనికి ఎక్కడ ఎలా పరిచయమయిందో, వారిద్దరు వివాహం చేసుకోవటం ఎలా సంభవించిందో అతను చెప్పనూలేదు—ఆమెకు ఇతరత్రా తెలియనూలేదు.

ఈ విషయాలన్నీ ఆలోచించుకొంటూ కారులో స్టేషనునుంచి సుందరియింటికి వెళ్ళుతున్న కళ్యాణి "అసలింతకీ మావారు నిన్నెక్కడ కలుసుకొన్నారు?" అని అడిగింది.

"అదొక చిత్రమయిన కథలే!" అని అన్నది సుందరి.



"రాత్రి నాలుగు బీరువాలు పగలగొట్టానంటున్నావ్, ఏమాత్రం సంపాయించావేమిటి ?"

"ఆఁ ఏమి చెప్పను? ఒక్కొక్కొటిగా పగలగొట్టుకొస్తిని. తీరా చూస్తే అది ఇనప బీరువాల కొట్టు."

---

"చెపుదూ" అని గునిసింది కళ్యాణి.

"ఆయన వచ్చినరోజుల్లో ఇక్కడ ఒక పెద్ద ఎగ్జిబిషన్ జరుగుతూ వుండేది. ఆ ఎగ్జిబిషన్ ఆర్గనైజ్ చేసిన కమిటీలో జయరామారావుగారు గూడా ఒక సభ్యుడగుటవల్ల మేం ప్రతిసాయంకాలం అక్కడకు వెళ్ళక తప్పేదికాదు. ఒక రోజు రాత్రి 8 గంటలకు మేం మద్రాసునుంచి, ఒక సినిమా నటిని పిలిపించి డ్యాన్సు పెరఫారమెన్సు ఒకటి పెట్టాం. ఆ నటి మంచి పేరుప్రఖ్యాతులు కలిగినదవటంవల్ల కమిటీ తరపున మేం

ఆర్గనైజ్ చేసిన సేల్సు వల్ల జనం తండోప తండాలుగా వచ్చారు. డ్యాన్సు ప్రారంభ మయింది. ముమ్మరంగా సాగుతుంది. నేను, జయరామారావుగారు ఇంకా కొంతమంది స్నేహితులు ముందు సీట్లలో తన్మయత్వంతో ఆ డ్యాన్సుని వీక్షిస్తున్నాం. నిజంగా ఆ రోజామె అత్యద్భుతంగా నృత్యం చేసింది. మేమే కాదు మాతోపాటు మిగతా ప్రేక్షకులంతా కనురెప్ప లేయకుండా ఆమె భంగిమలను అతినిశ్శబ్దంగా చూస్తూ కూర్చున్నారు. అటువంటి సమయంలో నా వెనుక సీట్లో నుంచి ''క్షమించండి మీపేరు సుందరీ దేవిగారేనా?'' అనే ప్రశ్న వినవచ్చింది

నేను వెనుదిరిగి చూశాను. విశ్వేశ్వరరావుగారు కనుపించారు. అప్పటికి ఆయనెవరో నాకు తెలియదు. ఎక్కడా చూసినట్లుగా కూడా అనిపించటంలేదు.

''అవును. నా పేరు సుందరి. మీ రెవరు?'' అని అడిగాను.

వారు నీపేరుచెప్పి ''ఆమె మీ చిన్ననాటి స్నేహితురాలు, జ్ఞాపకముందా''అని అడిగాడు

"నిజం చెప్పాలంటే నాకు నీవు జ్ఞాపకం రాలేదు. ఎప్పుడో చిన్నప్పుడు విడిపోయాం. ఎవరి దారి వారి దయింది. ఎవరో ఒక నూతన వ్యక్తి వచ్చి ఫలానా మనిషినిఎరుగుదురా అనేటప్పటికి వెంటనే గుర్తుకు తెచ్చుకోలేక పోయాను. నేను మనస్సులో చిన్ననాటి జ్ఞాపకాలు తిరగవేస్తూ వుండటం ఆయన గమనించి మరి కొన్ని విషయాలు గుర్తుకు తెచ్చారు. అప్పుడు జ్ఞాపకము వచ్చావు నీవు."

"కళ్యాణిని ఎరగక పోవటమేమిటి. ఆమె ఒకప్పుడు నాకు ప్రాణస్నేహితురాలు'' అన్నాను

''ఆమె భర్తను నేను'' అని ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ విశ్వేశ్వరరావు గారు చెప్పారు.

నేను చాలా సంతోషించాను. విశ్వేశ్వరరావుగారిని జయరామారావుగారికి పరిచయం చేశాను. వారు చాలా సంతోషించారు. ఆదేమి చిత్రమోగాని స్వభావసిద్ధంగా ఇటువంటి విషయాలు పట్టించుకోని జయరామారావుగారు నీ సంగతి ఎత్తేటప్పటికి పదే పదే గుచ్చి గుచ్చి అడిగి, చిన్ననాటి ముచ్చటలన్నీ తెలుసుకొన్నారు. నీ మీద ఎంతో వాత్సల్యం పెంచుకొన్నారు. నిజంగా నిన్ను రిసీవు చేసుకోటానికి ఆయన కూడా నాతో రావలసిందే. ఆఖరిక్షణంలో అర్జంటుపని వుండి ఎక్కడకో వెళ్ళవలసి వచ్చింది. వెళ్తూవెళ్తూ తనను క్షమించవలసిందిగా నిన్ను కోరమని నన్ను పురమాయించి వెళ్ళారు'' అని అన్నది సుందరి.

కారుమలుపు తిరిగింది. ఇరు ప్రక్కల పెద్దపెద్ద భవనాలుగల విశాలమయిన వీధిలోనుంచి పోతూంది. చల్లని గాలి కారులోకి దూసుకువచ్చి కళ్యాణి చెక్కిళ్ళను స్పృశిస్తున్నది. పక్కనున్న

తోటలోని రంగురంగుల పువ్వులు సువాసనలు వెదజల్లుతూ నయనానందకరంగా వెలుగొందుతున్నాయి.

నూజివీడు నుంచి సరాసరి వస్తున్న కళ్యాణికి ఏదో ఒక క్రొత్తలోకంలో అడుగుపెట్టినట్లు అనిపించింది. మనస్సులో తేనెలూరినాయి చెక్కిళ్లు గులాబు లయినాయి

"వారు వచ్చి నీ సంగతి చెప్పినప్పుడు నన్ను నేను మరచిపోయేంత ఆనందం కలిగిందక్కా'' అన్నది కళ్యాణి

''ఏమి చెప్పారేంటి?'' అని ఏదో రెట్టిస్తూ అడిగినట్లు అడిగింది సుందరి.


''బావగారు చాలా మంచివారని చెప్పారు, నీవు చాలా మర్యాద చేశావని చెప్పారు. ఇక్కడ వున్నన్నిరోజులూ మీ యింట్లోనే వున్నారటగా.''

''అందుకు మేము ఎంత మొహమాట పెట్టవలసి వచ్చింది? చివరకి జయరామారావుగారు వుండక తప్పదని పట్టుబడితే– అప్పుడు ఒప్పుకొన్నారు''

''కొత్త వాళ్ళంటే ఆయనకు సిగ్గులే అక్కా'' అని అన్నది కళ్యాణి

''అల్లాగే అనుకోవలసి వస్తుంది'' అని అన్నది సుందరి ముభావంగా.

సుందరి అలా అనటంలో వున్న భావం కళ్యాణికి అర్థంకాలేదు. తనభర్త ఏదో మోటుగా ప్రవర్తించి వుంటాడని అనుకొంది. కలుపు గోలుగా వుండి



"కత్తెరా, చిగురూ ఉంటే చాలు"

వుండడనుకొంది. ఆయన బీదకుటుంబంలో పుట్టాడు స్వశక్తిమీద ఆధారపడి కష్టపడి పైకివచ్చాడు ఉద్యోగం వచ్చినప్పటినుంచి కూడా అహర్నిశలు ఆస్పత్రిలో పనిచేయటమే ఆయనకు అలవాటు. ఇతరుల సంగతటుంచి ఒకొకప్పుడు తన సంగతే మరచిపోతూ వుండేవారు. ఎంతో నిగ్రహం కలిగిన తనకు కూడా ఒకొకప్పుడు కోపం వస్తుండేది. అటువంటి వ్యక్తితో సుందరిగాని ఆమె భర్తగాని కాస్త యిబ్బందిపడితే ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు అని అనుకొన్నది కళ్యాణి.

నెమ్మదిమీద విషయాలన్నీ సుందరి ద్వారా తెలుసుకొందామని నిశ్చయిం కొన్నది.

"చూ డక్కా!" అని ఏమో అడగ బోయింది.

అంతలోకే కారు మరొక మలుపు తిరిగింది. కారు ఒక కొండను చుట్టి ప్రయాణం చేస్తున్నది.

తాను అడగవలసిన ప్రశ్న ప్రస్తుతానికి ఆపేసి— నీవు యిక్కడకొచ్చి ఎన్నేళ్ళయింది అక్కా" అని అడిగింది కళ్యాణి.

"అయిదేళ్ళయింది"

"బావగారిని వివాహం చేసుకొనో?"

"ఇక్కడకువచ్చిన సంవత్సరమే."

"అంటే అదీ అయిదు సంవత్సరాలయిందన్నమాట"

"అవును...'

కారు కొండచుట్టూ తిరిగి పైకి వెళ్తొందని గ్రహించింది కళ్యాణి ఇటువంటి ప్రయాణం ఆమె ఎన్నడూ చేసి వుండలేదు. ఎప్పుడో చిన్నతనంలో బస్సులో తన తల్లిదండ్రులతో కలసి తిరుపతి కొండమీదకి ప్రయాణం చేసింది. అప్పటికీ యిప్పటికీ కొండమీదకి ప్రయాణంచేయటం ఇదే తొలిసారి. అప్పుడు బస్సుమీద వెళ్ళుతూవుంటే వాంతులయినాయి తన తండ్రి చీదరించుకొన్నాడు కూడా ఇప్పుడు బాగానేవుంది. సంఘాన్ని విడచి ఏదో మబ్బుల్లోకి ప్రయాణం చేస్తున్నట్లుగా వుంది.

ఒకసారి తన ప్రక్కన కూర్చుని కారు డ్రైవ్ చేస్తున్న సుందరిని చూచింది కళ్యాణి ఆమె సన్నని వేళ్ళు నున్నని శరీరం, గుప్పిటలోకి సరిపోయే నడుము, నిడుపాటి మెడ, మెత్తని చెక్కిళ్ళు, మీన నేత్రాలు ఆమెను ఆకర్షించినాయి.

నేనుకూడా ఇంత నాజూగ్గా వుంటే ఎంత బాగుండేది, అని అనిపించింది ఆమెకు ఆ క్షణం.

కారు కొండ మీదవున్న ఒకమేడ పోర్టికోలోకి వచ్చి ఆగింది.

"ఇదే కళ్యాణీ మా యిల్లు" అని అన్నది సుందరి.

సుందరితోపాటు, కళ్యాణి కూడా కారు దిగింది.


కళ్యాణినిచూచి వాకిట్లోవున్న జాతి కుక్క "బౌవ్" "బౌవ్"అని అరిచింది.

(సశేషం)

---

## సినిమా క్విజ్ - జవాబులు

1. ఇద్దరు మిత్రులు
2. ప్రేమ
3. గాలిమేడలు



బైటకు పనిఉండి వెళ్ళిన జయరామా రావు ఒంటిగంటకల్లా తిరిగొచ్చాడు. అప్పటికే రెండుసార్లు కాఫీ త్రాగిఉన్న కళ్యాణికి ఏ మాత్రం ఆకలివెయ్యలేదు. ఇక సుందరి సంగతి చెప్పనవసరం లేదు. ఆ యింట్లో ఉదయం భోజనం రెండు — మూడు గంటలకు చేయటం అందరికీ అలవాటే. సర్కారు జిల్లాల్లో వలె కాకుండా ఇక్కడ ఉదయం రొట్టెలు మొదలైన పుష్టికరమైన ఆహారం తింటారు. దీన్ని 'నాస్తా' అంటారు. రోజులో ఇదే ముఖ్యమైన ఆహారం. ఈ ఆహారం తీసుకునేటప్పటికి తొమ్మిది గంటలవుతుంది. తరువాత ఎవరిపనుల మీద వారు వెళ్ళి మధ్యమధ్య టీ తాగుతూ రెండు —— మూడు గంటలకు భోజనం చేస్తారు. ఇక్కడ సర్కారు జిల్లాల్లోవలె కాకుండా స్త్రీలు, పురుషులు కూడా రాత్రి పన్నెండు — ఒంటిగంట వరకూ మేల్కొని ఉంటారు. ఏ క్లబ్బుకో — ఏ గానాబజానాకో వెళ్ళి, అర్ధరాత్రయ్యే వరకు కులాసాగా కాలక్షేపం చేయటం ఇక్కడి వారికి అల వాటు. అందువల్ల ఉదయం పెందలకడే లేవరు. ఏ ఎనిమిది గంటలకో లేచి కాలకృత్యాలు ప్రారంభిస్తారు. తరువాత నాస్తా చేసి. పనుల్లోకి వెళ్తారు. అందు వల్లే బజార్లో ప్రసిద్ధిచెందిన షాపులు సైతం ఉదయం ఏ పదిగంటలకు మాత్రమే తెరువబడుతవి. పదిగంటలకు ముందు బజారుల్లో తిరిగే ఉత్తరజిల్లా వాసులకు బజార్లు నిర్మానుష్యంగా కనబడి విచిత్రం అనిపిస్తుంది.

దీనికి కారణం — ఈ ప్రదేశం నిన్న మొన్నటి వరకూ మహమ్మదీయ రాజుల పరిపాలనలో ఉండటమే. మనకు 'నేడు' అనేది లేదు మహమ్మదీయులకు 'రేపు' అనేది లేదు. మనం ఎప్పటికప్పుడు 'నేటి' కోసం రేపటిని త్యజిస్తూ వుంటాం. అందువల్ల జీవితం మన అనుభవంలోకి రాదు. మహమ్మదీయులకు ఏ క్షణానికి ఆ క్షణమే నిజమైంది. భవిష్యత్తులో ఉన్న క్షణాలు వారిని ఏకాస్త కూడా ఆకర్షించవు. అందువల్ల ఎప్పటికప్పుడు వీలైన అన్ని విధాల జీవితాన్ని అనుభవించటమే వారి పరమావధి. వారు ఏ సిద్ధాంతాలకోసమో — ఏ ఆదర్శం కోసమో తమ జీవితాలను

మలుపుకోరు. జీవితం అందించే ఏ సుఖాన్నీ అందుకు వదులు కోరు. మనకు సిద్ధాంతం ముఖ్యమైతే — వారికి జీవితం ముఖ్యం. మనకు ఆదర్శం ముఖ్యమైతే- వారికి అనుభవం ముఖ్యం.

ఏ దేశంలోనైనా అధికార వర్గాల ఆచారవ్యవహారాలను ప్రజల్లో ఉన్న పై వర్గాలవారు అనుసరించటం పరిపాటి. హైదరాబాదులో కూడా ఈపనే జరిగింది. హైదరాబాదులో నివసించే హిందువులు షేర్వాణీ వేసి, టర్కీటోపీ పెట్టటం ఉత్తర జిల్లా వాసులకు విపరీతంగా కని పిస్తుంది. కానీ వారు సూటువేసి, హేట్ ధరించటం మాత్రం మామూలు వ్యవ హారంగానే ఉంటుంది. ఇద్దరూ అధికార వర్గం వారి ద్వేషాలను అనుసరిస్తూన్నా మని వారికి తట్టదు. అలవాటులో నున్న చోద్యం ఇది.

జయరామారావు హైదరాబాదులోనే పెరిగినవాడవటంవల్ల పరిపాలకుల సంస్కారాన్ని పూర్తిగా అనుసరించే స్వభావం కలవాడు. మాంసం తినటం, మద్యపానం చేయటం అతనికి తప్పుకాదు. జల్సాగా బ్రతకటం అతనికి ఇష్టం. ఎవరైనా దేనికోసమైనా ఆరాటపడటం, ఆవేశపడటం అతనికి మోటుగా కని పిస్తయి. ఏదో ఒక నెపంతో జీవితం అందించే అందాలను, ఆనందాలను ఒదులు కోవటం అతనికి వెర్రిగా కనిపిస్తుంది. డబ్బు విషయంలో కూడా అతని దృష్టి అదే. నైతికధర్మం అనే నమ్మకంతో కొంతమంది డబ్బునూ, అధికారావకాశా లను ఒదులుకోవటం అతను ఇటీవల చూస్తూన్నాడు. అటువంటివి అతనికి ఏ మాత్రమూ అర్థమయ్యేవికావు పైగా అటువంటి వ్యక్తులను చూసినప్పుడు బలమైన ఏ ఆబోతులనో చొచ్చుకొస్తున్న యే ఏనుగుల గుంపునో — బాంబులను విసురుతున్న ఏ విమానాల వరుసనో చూసినట్లు అతని మనస్సు చికాకుపడుతూ వుండేది. జీవితంలో ఏ అనుభవాన్నీ తోసివేయకూడదని అతని అభిలాష.

అయితే సిద్ధాంతాలూ, ఆదర్శాలూ జీవితానికి సంబంధించినవి కావా అంటే, సంబంధించినవేమోకాని జీవితం మాత్రం కాదని అతని అభిప్రాయం. పోనీ అవి కూడా జీవితంలో నుంచి పుట్టుకొచ్చినవే గదా అంటే జీవితానికీ, జీవిత సారాంశా నికీ; తండ్రికీ — కొడుక్కీ, భార్యకీ — కూతురుకీ ; నదీజలానికీ — గమనానికీ ఉన్నంత తేడా వుందని అతని నమ్మకం. ఈ నమ్మకంతో జీవితంలోని ప్రతిక్షణాన్నీ మధుర క్షణం చేసుకునే ప్రయత్నంలో అతను వుంటాడు.

అతనికి కళ్యాణి పేరు విన్నప్పటి నుంచీ ఆమె మీద మమకారం కలిగింది. కళ్యాణి పల్లెటూరిలో పుట్టి చదువుకున్న దవటం దీనికి కారణం కావచ్చు. కళ్యాణి రూపురేఖలను వర్ణించి చెప్పటం కారణం కావచ్చు. విశ్వేశ్వరరావులో తాను



"ఏమండీ మీకు ఒక శుభవార్త. పక్కింటావిడ 120 రూపాయలకు కొన్న చీరలాంటి చీరె అదే షాపులో 110 రూపాయలకు కొన్నా."

చూసిన అమాయకత్వం కారణం కావచ్చును. ఏ కారణంవల్ల నయితేనేం_ కళ్యాణి పేరు విన్నప్పటి నుంచీ ఆమెను చూడాలని అతను తహతహ పడసాగాడు.

తన తహతహను సుందరి దగ్గర అతను దాచలేదు. నిజానికి వారు జీవిస్తూన్న జీవిత విధానంలో అలా దాచవలసిన అవసరం కూడా లేదు. వారిద్దరూ ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకుని ఒకరికొకరు హృదయపూర్వకంగా సహాయం చేసుకునే దంపతులు.

"మీరు త్వరగా ఇక్కడి కొచ్చేయండి" అన్నాడు, విశ్వేశ్వరరావుతో జయరామారావు.

''ఇల్లు దొరక్కపోతే మా యింట్లోనే ఉండవచ్చు'' అనికూడా అన్నాడు.

అంతటితో ఆగక ''మీ భార్యను చూడాలని వుంది'' అనికూడా చెప్పాడు.

కళ్యాణికి పిల్లలు లేకపోవటం కూడా అతనికి ఆకర్షణగానే కనిపించింది.

విశ్వేశ్వరరావు లేనప్పుడు ఈ విషయం సుందరితో ప్రస్తావించాడు జయరామారావు.

''ఆమె నిక్కడికి త్వరగా తీసుకొచ్చే బాధ్యత నీది'' అన్నాడు.

''ఆమెను మనింట్లో ఉండేట్లు చేసే బాధ్యత కూడా నీదే'' అనికూడా అన్నాడు.

అంతటితో ఆగక ''ఆమెకు నవ్య భావాలను కలిగించే పనికూడా నీదే'' అని కూడా చెప్పాడు. అతని మాటలకు సుందరి నవ్వి ఊరుకుంది.

''నవ్వుతావేం?'' అని అడిగాడు జయరామారావు.

''ఊరికినె''.

''నువ్వు ఊరికినే నవ్వవు. ఆమె ఇక్కడికి రావటం నీకు యిష్టంగా వున్నట్టు లేదు'' అన్నాడు జయరామారావు.

''ఇదా మీరు నన్ను యిన్నాళ్ళనుంచీ అర్థంచేసుకుంది?'' అని అడిగింది సుందరి.

''మరెందుకు ముభావంగా వున్నావ్?'' అని అడిగాడు జయరామారావు.

''లేనే'' అని అన్నది సుందరి అమాయకంగా.

"నీ మనస్సులో ఏమైనావుంటే చెప్పు. నీ కోర్కె నేదీ నేను కాదనను. ఎందుకు

మరీ నన్నిట్లా ఉబలాట పెడతావ్ ?" అని అన్నాడు జయరామారావు.

ఇటువంటి పరిస్థితిలో తా నేదడిగినా తన భర్త చేస్తాడని సుందరికి తెలుసు. అందులో తను అడగబోయేది కూడా అతను చేయకూడనిదీ, చేయలేనిదీ ఏదీ కాదు. కాకపోతే అతనిది ఇచ్చి—తీసుకునే బుద్ధి. ఇతరులు అందులో ముఖ్యంగా తన భార్య ఎంత ఆనందం పొందుతుందో—అంత ఆనందాన్నీ అనుభవించే అవకాశం ఆమెవల్ల తనకు కలిగినప్పుడే అతను సహించగలుతాడు "నీకు నేను ఈ అవకాశాన్ని కలిగించినప్పుడు—నీవు నాకు అటువంటి అవకాశాన్నే కలిగించాల్సిన బాధ్యత వహించాలి" అనే దృష్టితో తప్ప వేరొక దృష్టితో తను ఏ సమస్యనూ పరిశీలించ లేడు. తనకు ఆ అవకాశం ఆమెవల్ల కలిగేంత వరకూ చికాకు పడుతూ ఉంటాడు. ఈ సంగతి ఆమెకు తెలుసు. అంతేకాదు — ఇటువంటి సంగతులు తన భర్తతో ఎప్పుడు ప్రస్తావించాలో తెలుసు. అందుకని భర్తే తనకు తాను కలిగించిన ఈ అవకాశాన్ని ఆమె జారవిడువ దలచలేదు

"మరి ఇటీవల సదానంద్ ఇక్కడికి వస్తూన్నప్పుడు మీరెందుకంత చిరాకుగా వుంటున్నారు ? మనం ఇతర దంపతుల్లాగా కాకుండా ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకున్నవాళ్లం. ఒకరి కోర్కెలను ఒకరు తీర్చటానికి హృదయపూర్వకంగా సహకరించుకోవాలని విశ్వసించే వాళ్ళం. అటువంటి మీరు సదానంద్‌తో కలిసి మెలిసి వుండక — విముఖత చూపించటమెందుకు? మీ రలాగుంటే ఆయన ఏమనుకుంటాడు ? మన యింటికి రావటానికి అంగీకరిస్తాడా ? పెద్ద నాగరీకులం అని మనం అనుకుంటున్నామే — ఇదేనా మన నాగరికత? అతన్ని చూస్తే మీరు ఈర్ష్యపడుతున్నారనికూడా నాకు అనుమానంగా వుంది. మనకంటే పొలంపని చేసుకునే స్త్రీ పురుషులు, రాళ్ళు కొట్టుకునే స్త్రీ పురుషులు, మట్టి తట్టలు మోసే స్త్రీ పురుషులే మెరుగు. వారు కలిసిమెలిసి తిరుగుతారు, విచ్చలవిడిగా సరసాలాడుకుంటారు. తమ మనస్సు చెప్పినట్లుచేసి, ఆనందిస్తారు. వారికున్న విశాలత్వమైనా మనకు లేకపోతే ఏట్లా?'' అని అన్నది.

వెంటనే అతనికి సదానంద్ సంగతి జ్ఞాపకం వచ్చింది. నిజానికి సదానంద్‌కీ—తన భార్యకూ స్నేహం కలపడానికి అతను చాలా సహాయపడ్డాడు ఆ పని అతను సంతోషపూర్వకంగా చేశాడు. తన భార్యవల్ల అటువంటి అవకాశం ఒకటి తనకు దొరకటమే కారణం. తన భార్య తంత్రిచేస్తూన్న ఆఫీసులో కరుణాదేవి అనే ఆమె కొత్తగా జేరింది. ఆమె వయస్సులో పెద్దదే. ముగ్గురు పిల్లలు కూడాను. భర్త బొంబాయిలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడు.

తను ఒకసారి ఆమెను చూడటం తటస్థించింది. ఆ విషయం సుందరితో ప్రస్తావించాడు. వెంటనే సుందరి ఆమెతో స్నేహం కలుపుకుని, ఇంటికి ఆహ్వానించింది. తనకు పరిచయం చేసింది. అప్పటినుంచీ ఆమె రోజూ మధ్యాహ్నం వేళ భోజనానికి తనింటికే వస్తూండేది. తన భార్యతో కలిసి రావడంవల్ల ఎవరూ అనుమానపడేవారు కాదు

ఆమె రావటం మొదలు పెట్టిన కొద్ది రోజుల్లో సుందరి సదానంద్‌తో స్నేహం ప్రారంభించింది. అతన్ని ఇంటికి ఆహ్వానించింది అతను రాగానే తను ఆఫీసుపనిమీద బైటకు వెళ్ళేవాడు. కరుణాదేవి రాగానే సుందరి బజారు పనులు చూసుకోడానికి వెళ్ళేది. కొన్ని రోజులు జల్సాగా జరిగిపోయినవి.

కాని ఇప్పుడు కరుణాదేవి లేదు. ఢిల్లీలో తనకు పరిచయంఉన్నవారి ద్వారా ప్రయత్నించి, కరుణాదేవి భర్త ఆమెను బొంబాయికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. కరుణాదేవైతే వెళ్ళిపోయిందిగాని, సదానంద్ మాత్రం రావడం మానుకోలేదు. తన భార్య తన ఆనందమే చూసుకుంటోందే గాని – తన సంగతి ఆలోచించటంలేదనే అభిప్రాయం తనకు కలిగింది. అప్పటినుంచీ సదానంద్‌ను చూస్తే తనకు కాస్త చిరాగ్గా వుండేది.

ఒకరోజు ''చచ్చేదాకా అతడిట్లా వస్తూ వుండాల్సిందేనా ?'' అని భార్య నడిగాడు.

ఈ ప్రశ్నకు సుందరి తృళ్ళిపడి చూసింది. సమాధానం మాత్రం చెప్పలేదు. సదానంద్ రావటం మాత్రం ఆగలేదు.

ఈ విషయాలన్నీ జ్ఞాపకం వచ్చినవి జయరామారావుకి.

''మరి నా సంగతి ఆలోచించక పోతే ఏం చెయ్యమంటావ్ ?'' అన్నాడు.

''మీ సంగతి నేను ఎప్పుడూ ఆలోచిస్తూనే వున్నాను.''

''ఆలోచించి ఇటీవల నువ్వు చేసిందేమిటి ?''

''అవకాశం దొరకవద్దా ? అవేమీ బజారుల్లో కుప్పలు కుప్పలుగా పడి వుండేవి కావుగదా ?''

"సరేలే–జరిగిందేదో జరిగిపోయింది. కళ్యాణి విషయంలో మాత్రం కాస్త శ్రద్ధ తీసుకో.సదానంద్ఎన్నిసార్లొచ్చిపోయినా నేను సంతోషిస్తానే గాని విచారించను. కావాలంటే నేనే వెళ్ళి తీసుకొస్తాను. మన సహకారోద్యమం నిర్విఘ్నంగా సాగాలని నా వాంఛ".

అన్నట్టుగానే ఆ సాయింకాలం అతనే కారు వేసుకుని వెళ్ళి, సదానంద్‌ని తీసుకొచ్చి దింపి ఆఫీసుపనిమీద బైటకు వెళ్ళిపోయాడు.

ఇంత ఆవేశంలో ఉన్న జయరామారావు ఇంట్లో అడుగు పెట్టీపెట్టగానే

కళ్యాణిసంగతి అడగటంలో ఆశ్చర్యం లేదు. ఎదురుగా వచ్చిన నౌఖరుని "అమ్మ గారు స్టేషన్ నుంచి వచ్చారా ?'' అని అడిగాడు. అతను వచ్చారనిచెప్తే "వెంట ఇంకెవరైనా ఉన్నారా ?" అని ప్రశ్నించాడు. అతను 'ఉన్నారండీ' అంటే ''ఆడవారేనా ?'' అనడిగాడు. అతను 'ఔను' అనేటప్పటికి అతని ఆరాటం ఇంకా హెచ్చింది. వచ్చినవాడు వచ్చి నట్లుగా గబగబా ఇంట్లోకి వెళ్లాడు.

అతను సరాసరి సుందరి పడకగది లోకి వెళ్లాడు. అప్పుడు సుందరి పక్క మీద పడుకుని, కళ్యాణిని దగ్గరగా కూర్చోపెట్టుకుని, ఏవో కబుర్లు చెబుతూ వుంది. జయరామారావును చూచి కళ్యాణి లేవబోయింది.

''ఎందుకు లేవటం ?'' అని ఆమె పమిటను పట్టుకుని ఆపింది సుందరి. పమిట తొలుగుతుందనే భయం లేకపోతే లేచి నిల్చునేదే కళ్యాణి. కళ్యాణిని ఈ విధంగా కూర్చోపెట్టి, భర్తతో "ఆ కుర్చీని దగ్గరకు లాక్కోండి" అని అన్నది సుందరి.

అతను కళ్యాణిని చూసి, ముసిముసి నవ్వులు నవ్వుతూ కుర్చీ దగ్గరకు లాక్కొని కూర్చుని "ఎంతసేపయింది వచ్చి ?" అనడిగాడు.

కళ్యాణి సిగ్గుతో సమాధానం చెప్ప కుండా తల వంచుకుని కూర్చుంది.

''చెప్పవేం ?'' అని చేత్తో ఆప్యా యంగా తోస్తూ, పురికొల్పింది సుందరి.

"నువ్వు చెప్పరాదూ ?" అన గలిగింది కళ్యాణి

''ఆయనకు నువ్వు చెబితే వినాల నుంటే—నేను చెప్పి—ఏ ప్రయోజనం ?'' అన్నది సుందరి.

కళ్యాణి శరీరం ఒక్కసారి ఝల్లు మన్నది.

''చెబితే మీ నోటిముత్యాలు రాలవు లెండి'' అన్నాడు జయరామారావు.

''ఆయన దసలే మొండిపట్టు, చెప్పే దాకా ఒదిలి పెట్టరు. చెప్పివేద్దూ" అన్నది సుందరి.

''ఏమని ?" అని ప్రశ్నించిది కళ్యాణి.

"ఎప్పుడొచ్చిందీను ?"

''ఇప్పుడేగా మనం ఒచ్చింది" అన్నది కళ్యాణి.

"నాకు చెభితే ఏం లాభం. ఆయనకు చెప్పు.'' కళ్యాణికా యిద్దరు మనుషులూ చాలా విచిత్రంగానూ, విడ్డూరంగాను కనుపించారు. అసలా వాతావరణమే గమ్మత్తనిపించింది. ఆమెకు చెప్పక తప్పలేదు.

"ఇంతకుముందే ఒచ్చేమండీ..." అన్నది తల ఒంచుకుని.

''మొత్తానికి నీ స్నేహితురాలిచే పలి కించావు సుందరీ'' అని సంతోషించాడు జయరామారావు.



"వచ్చే సీనులో మీరు సింహాన్ని చీల్చేయాలి"
"అదే నన్ను చీల్చేస్తే ?"
"ఫర్వాలేదు. కథలో రెండులైన్లు మార్చేస్తే సరిపోయె"

---

"కొత్తగనక అలా వుంది. నాలుగు రోజులాగండి. మనల్నే పలికిస్తుంది.'' అన్నది సుందరి, భర్తను క్రీగంట చూస్తూ.

"నిజమేనా కళ్యాణీ ?'' అనడిగాడు జయరామారావు.

''నిజమే అయ్యుండాలి. లేకపోతే సుందరక్క ఎందుకంటుంది ?" అని తిరుగు ప్రశ్న వేసింది కళ్యాణి.

మాటయితే అన్నదేగాని వెంటనే సిగ్గుపడింది. తాను మాటకు మాట అనే స్వభావం గలదికాదు. జోరుగా మాట్లాడే స్వభావం గలదీ కాదు. ఎవరైనా మాట్లాడితే వినాలనే కుతూహలంగల దామె. ఈ వాతావరణంలో మాటకు మాట అనక తప్పటంలేదు. అన్న తరువాత ఇదీ బాగానే వుంది కళ్యాణికి.

"స్నానం చేశారా ?'' అనడిగాడు జయరామారావు.

"అప్పుడేనా ? వచ్చినప్పటినుంచీ మీకోసం ఎదురుచూడటమే సరిపోయింది." అన్నది సుందరి.

"అయితే కానివ్వండి ... కళ్యాణికి ఆకలివేస్తూ వుండి వుండాలి." అన్నాడు జయరామారావు.

కళ్యాణి అతనిమాటకు సమాధానం చెప్పవలసిన అవసరం వున్నట్టు కనిపించింది. ఇదివరకైతే అలా కనిపించినా మెదలకుండా ఊరుకునేది. ఇప్పుడు అలా ఊరుకోబుద్ధికాలేదు.

''నాకు తొందరేం లేదండీ," అన్నది.

నవ్వుతూ కూర్చున్న భర్తతో సుందరి "అట్లా మాట్లాడకుండా కూర్చుంటారేం ? కళ్యాణి చెప్పేది మీకే..." అన్నది.

" నాక్కాదు—నీకు.''

''నాకు కాదు—మీకు''

''నీకే అంటూంటే..."

"పోనీ కళ్యాణినే అడుగుదాం'' అన్నది సుందరి. అని ''ఎవరితోనమ్మా నువ్విప్పుడు చెప్పింది ?'' అనడిగింది.

కళ్యాణికి ఏమీ పాలుపోలేదు. ఇంతంత చిన్న విషయాల మీద ఈ విధంగా సంభాషణలు పెరగటం, తర్జన భర్జనలు జరగటం ఆమెకు వింతగా తోచింది.

"నన్నెవరడిగారో — వారితో" అన్నది.

"చూశారా — మీతోనే. నే చెప్తే నమ్మేరు కాదు. నాకంటే మీరంటేనే కళ్యాణికి యిష్టం'' అన్నది సుందరి.

కళ్యాణి మనస్సు కళుక్కుమన్నది.

"నిజమేనా ? నేనంటేనే నీ కెక్కువ ఇష్టమా ?" అని ఆతృతగా అడిగాడు జయరామారావు.

కళ్యాణి ఏం చెప్పేటట్టు ? తన మనస్సు అడ్డుగోడలమీదకి ఎగబ్రాకుతున్నట్లనిపించిందామెకు. ఆ గోడల అవతల ఏమున్నదో అని భయంవేసింది.

"మీ ఇద్దరన్నా నాకిష్టమే,'' అన్నది

"చూశారా ... ఎంత తెలివిగలదో''' అని భర్తతో చెప్పింది సుందరి

"నన్ను నీతో జతజేసినందుకు ఒక విధంగా నాకు సంతోషంగానే వుంది. ఇక స్నానాలకు లేవండి'' అన్నాడు జయరామారావు.

"ముందు నేను చేసివస్తాను,'' అని అక్కడినుండి లేచింది సుందరి.

"ముందు నన్ను చెయ్యనివ్వు'' అని కళ్యాణి అందామనుకుంది గాని అనలేకపోయింది. అంటే దానిమీద మళ్ళీ సంభాషణ పెరుగుతుంది. చివరికెట్లాగూ సుందరే ముందు బయల్దేరుతుంది. ఒకవేళ సాహసించి, తాను ముందు బయల్దేరినా స్నానాలగది కోసం వెతుక్కోవాలి. తుండుగుడ్డకోసం వెతుక్కోవాలి. స్నానం చేసినంతసేపూ భయం భయంగానే వుంటుంది. చివరికి స్నానం చేసినట్టే వుండదు.

ఈ ఆలోచనలో పడి, సుందరి స్నానానికి బయల్దేరటం చూస్తూ వూరుకుంది కళ్యాణి. ఇప్పుడు జయరామారావు—తనే ఆ గదిలో వున్నారు. ఆమెకు అంతా అగమ్యగోచరమనిపించింది. పడకగదిలోకి ఎకాఎకీన రావటం, అతడితో సుందరి పడుకునే మాట్లాడటం, సంభాషణలో అవసరం చిక్కినప్పుడల్లా సుందరి ఆమె భర్తతో తనను జోడించటానికి ప్రయత్నించటం అంతా కొత్తగా వుంది. హాయిగా వుందా ? ఏమో ? అప్పటి కామె చెప్పగలిగిన స్థితిలో లేదు.

"మీరు ఏం చేస్తూంటారు ?" అని అడిగాడు జయరామారావు.

సమాధానం ఏం చెప్పాలా అని ఆమె ఆలోచించింది. ఉన్నది ఉన్నట్టుగానే చెబుదామని—

"వంట చేస్తూంటాను" అన్నది.

ఆ మాటలో విపరీతమైన హాస్యం జనించింది. విరగబడి నవ్వాడు.

"ఏమిటందోయ్—తెగ నవ్వుతున్నారు ?" అని స్నానాల గదినుంచే కేకపెట్టి అడిగింది సుందరి.

ఆ కేకకు కళ్యాణి మనస్సు త్రొక్కిసలాడింది. అంతవరకూ ఏపురుషుడుతోనూ తనభర్తసైతం తనతో స్నానాన్నిగురించి

చర్చించి ఎరుగదు. తాను ఏ పురుషుడూ చూస్తున్నప్పుడు స్నానాల గదిలోకి వెళ్లి ఎరుగదు. తాను స్నానాలగదిలో ఉండగా బైట అలికిడైతే పురుషులెవరైనా వచ్చారేమోనని సిగ్గుతో చివికిపోయేది. తాను స్నానాల గదిలో ఉన్నట్లు ఏ పురుషుడికైనా ఊహించుకునే అవకాశం ఉన్నట్టు తడితే–వారికి తాను నగ్నంగా కనబడుతున్నట్టే అనిపించి, శరీరం గగుర్పొడిచేది. గబగబా నాలుగైదు చెంబుల నీళ్లు పోసుకుంటేగాని మామూలు స్థితికి వచ్చేదికాదు. అటువంటిది ఇప్పుడు సుందరి స్నానాలగదిలో ఉండటమేగాక– స్నానంచేస్తూ మాట్లాడూతూ వుంది! అక్కడినుంచే తమతో చర్చలు ప్రారంభిస్తుందేమోననే భయం వేసింది కళ్యాణికి.

సుందరి ప్రశ్నకు సమాధానంగా, "కళ్యాణి తెగ నవ్విస్తోంది" అని కేక వేశాడు జయరామారావు.

అదృష్టవశాత్తూ, తాను నోచిన నోముల ఫలితంగా స్నానాలగదిలోంచి సుందరి మాట్లాడలేదు.

"విశ్వేశ్వరరావుగారికి ఆఫీసులో ఎక్కువపని వుంటుందనుకుంటాను" అన్నాడు జయరామారావు.

"నిజమేనండీ" అన్నది కళ్యాణి.

"అప్పుడు మీ రేంజేస్తూంటారు?" అనడిగాడు జయరామారావు.

"నిద్రపోతుంటాను" అన్నది కళ్యాణి ఉన్నది ఉన్నట్టు చెప్పాలనే తన సంకల్పానికి అనుగుణ్యంగా.

ఈ సమాధానంకూడా జయరామారావు నవ్వుకే కారణమైంది. అయితే అతను ఈసారి గుసగుస నవ్వాడు. ఆ నవ్వు స్నానాలగదిలోకి వినబడేంత బిగ్గరగా లేనందుకు వెయ్యి దేవుళ్ళకు నమస్కరించింది కళ్యాణి.

"అయితే మీకు నిద్రంటే ఎక్కువ ఇష్టమా?" అనడిగాడు జయరామారావు.

సంభాషణ పెరగకుండా వుండాలనే ఉద్దేశంతో "ఇష్టమే" అన్నది కళ్యాణి.

"సుందరికీ అంతే" అన్నాడు జయరామారావు, మళ్ళీ ముసిముసి నవ్వులు నవ్వుతూ

జయరామారావు భార్యతో తనను జతపర్చటం కళ్యాణికి మనస్కరించలేదు. భూమివంకకు చూస్తూ, నేలను కాలరాస్తూ కూర్చుంది.

"మీరంటే విశ్వేశ్వరరావుకి అంత ప్రేమ ఎందుకో ఇప్పుడు నాకు అర్థమైంది," అన్నాడు జయరామారావు.

కళ్యాణికి ఆలోచించ బుద్ధయింది. తన భర్త తన్ను ప్రేమిస్తున్నట్టు అతనితో చెప్పాడా? అలా చెప్పాల్సిన అవసరం ఏమొచ్చిందో? తనను గురించి ఇంకా ఏమేమి చెప్పారో! ఏమేమి మాట్లాడుకున్నారో! ఈ మగవాళ్ళకు రహస్యాలు దాచటం చేతకాదు.

అందులో ప్రేమించిన స్త్రీకి సంబంధించిన రహస్యాలు అసలే దాచలేరు, ఎవరితోనో ఒకరితో చెప్పుకుంటేగాని వారికి తృప్తిగా వుండదు. ఇతర్లతో చెప్పుకోటంలో ఉన్న ఆనందం ఏమిటో! పశువుకి నెమరు వేయటంలో ఉన్న ఆనందం వీరికి ఇందులో ఉంటుంది కాబోలు!

అలా ఆలోచించింది కళ్యాణి. కాసేపటికి ఆ ఆలోచనలకు సిగ్గువేసింది.

"ఇటు చూడండి" అనడిగాడు జయరామారావు.

ఆమె అప్రయత్నంగా తల పైకెత్తింది.

అతను సూటిగా ఆమె కన్నులలోకి చూస్తూ "అతనంటే మీకూ ఇష్టమేనా?" అనడిగాడు.

ఈ ప్రశ్నకు ఆమె చూపులు చెదిరినవి. శరీరం పనసడిప్ప అయింది. పెదవి అదిరింది. ఏదో శక్తి ఆమెలోకి దిగి దశదిశలా గిరురిస్తూ, ప్రవహిస్తున్నట్లు అనిపించింది. అంతలో తలవాల్చింది.

జయరామారావు నవ్వుతూ "అతను చాలా మంచివాడు. సహృదయుడు. మీకు ఇష్టం కాకుండా ఎందుకుంటుందీ! ఇష్టమయ్యే వుండాలి. మీ దాంపత్యం చూస్తూంటే నాకు కూడా పరమానందంగా వుంది," అన్నాడు.

అంతటితో ఆమె కేదో ప్రమాదం తప్పినట్లు, విరుచుకు పడుతుందనుకున్న ఆకాశం విచ్చుకుపోయినట్లు; చుట్టుముటుతుందనుకున్న అగ్ని ఆరిపోయినట్లు అనిపించింది. ఒక నిట్టూర్పు విడిచింది.

వెంటనే జయరామారావు సుందరిని ప్రేమించటంలేదేమో అనే అనుమానం కలిగింది వారి సంభాషణబట్టి అలా అనుకోటానికి వీలులేదు. అలా అనుకోకుండా ఉండటానికి కూడా వీలున్నట్లు కనబడదు. వారు ఆవేశాలకు పైన వుండి మాట్లాడినట్టు మాట్లాడుకుంటారు. ఎంతసేపూ ఇతరులను గురించి మాట్లాడుకుంటారేగాని — తమనూ గురించి తాము మాట్లాడుకోరు. కాని ఒకరిమీద ఒకరికి చాలా సద్భావం, నమ్మకం వున్నట్లు మాట్లాడుకుంటారు.

ఆమెకు అతనిని గురించి కొన్ని ప్రశ్నలు అడగాలనిపించింది. సుందరికీ అతనికీ ఉన్న బాంధవ్యంలోతు తెలుసుకోవాలనిపించింది. కాని ఒక ప్రశ్నవేస్తే అది ఏ అగాధంలోకి దింపుతుందోనని సంకోచం కలిగింది. వీరితో మొదట ప్రశ్న వేయటం వరకే తన యిష్టం. తరువాత వీరి యిష్టాన్నిబట్టి సంభాషణ సాగుతుంది. అందుకని మెదలకుండా ఊరుకుంది కళ్యాణి.

"ఇక్కడున్న మేమిద్దరం ప్రాణస్నేహితులమయ్యాం" అన్నాడు జయరామారావు.

అతను తన భర్తనుగురించే మాట్లాడుతున్నాడని గ్రహించటానికి ఆమె కెక్కువసేపు పట్టలేదు తన భర్త స్వభావ

సిద్ధంగా తొందరగా పరిచయాలు చేసుకునే మనిషికాదు. అటువంటి ఆయన కొద్ది కాలంలోనే ఇతనికి ప్రాణస్నేహితు డెలా అయ్యారో !

ఆ చొరవ ఈ మనిషిలోనే ఉందని అనుకుంది కళ్యాణి.

ఇతరులు మామూలుగా పాటించే నియమాలను ఈ మనిషి పాటించడు. ఇతరులు మాట్లాడటానికి సంకోచించే విషయాలను ఈ మనిషి అనర్గళంగా మాట్లాడుతాడు. ఇతరుల మనస్సుల కున్న సరిహద్దులు ఈ మనిషికి లేవు. తనకు ఇష్టమైన చోటికి చొచ్చుకు పోవడమే ఈ మనిషి స్వభావం. ఇత రులు జీవించని జీవితం జీవించినందువల్ల ఈ స్వభావం ఏర్పడి వుండవచ్చును. కాకపోతే పుటకతోటే వచ్చివుండ వచ్చును.

ఆమె ఇలా ఆలోచిస్తూవుండగా జయ రామారావు మళ్ళీ మాట్లాడాడు.

"అతను నాకే కాదు—సుందరికికూడా ప్రాణస్నేహితుడే"

ఈ మాటకు కళ్యాణి ఉలిక్కిపడింది. జయరామారావు చెప్పుకుపోయాడు.

"ఇక్కడున్నన్నాళ్ళూ అతను లేకుండా సుందరి భోజనంచేసేది కాదు. ఒక్కొక్కరోజు తానే వంటకాలు సిద్ధం చేసేది కూడానూ. సుందరి గుణమే అంత. నచ్చితే అలా నచ్చుతుంది. లేక



"రిటరన్ టికెట్ ఒకటివ్వండి"
"ఏ ఊరికి ?"
"ఏ ఊరికైతే నీ కెందుకూ, రిటరన్ టికెట్ అంటే ఈ ఊరికేగా."

పోతే లేదు. నచ్చితే ఆ మనిషికోసం ఎన్ని త్యాగాలనైనా—ఎటువంటి త్యాగాల నైనా చేస్తుంది. లేకపోతే ముఖమయినా చూడదు. చాలా మంచిమనిషి. ఉదార బుద్ధి కలది" అన్నాడు.

సుందరిని గురించి జయరామారావు తనముందు ఎందుకు పొగడుతున్నాడో కళ్యాణికి అర్థం కాలేదు. తన ఆలోచనలు పసికట్టలేదుకదా ? అని ప్రశ్నించుకున్నది. నిజంగానే సుందరంటే ఇష్టమై ఆపుకో లేక తనతో చెబుతూఉండొచ్చు అను కుంది.

"మీరు నాతో ఫ్రీగా మాట్లాటం లేదు" అన్నాడు జయరామారావు.

"ఏం మాట్లాడేదండీ ?'' అనడిగింది కళ్యాణి

''ఏదో ఒకటి మాట్లాడండి — మీరేది మాట్లాడినా బాగానే వుంటుంది" అన్నాడు జయరామారావు.

అతని మాటలకు చిరునవ్వు నవ్వకుండా ఉండలేకపోయింది కళ్యాణి.

"ముందు చక్కగా నవ్వగలదు." అన్నాడు జయరామారావు.

ఈ సంగతి యింతకుముందు ఎవ్వరూ తనతో అనలేదు. నిజంగానే తన నవ్వు చక్కగా వుంటుందేమో. జయరామారావు కొన్ని విషయాలలో స్ఫురద్రూపి ఆయన అన్న మాటల్లో నిజంఉండవచ్చు. అప్పుడప్పుడు తను అద్దంలో చూసుకు నవ్వుకుంటూ ఉండేది. నిజంగానే తన నవ్వు తనకు బాగుంటుండేది. కాని ఇంత వరకూ ఎవరూ తనతో ఆమాట అనలేదు. ఇప్పుడితను అంటున్నాడు.

అంతలో సుందరి స్నానం ముగించుకుని శరీరాన్ని చీరతో కప్పుకుని, వారి ముందు నుండే పరుగెత్తుకుంటూ ప్రక్క గదిలోకి వెళ్ళింది. వెళ్తూ — వెళ్తూ ఒక క్రీగంటి చూపు కళ్యాణి వైపు విసిరి వెళ్ళింది. శరీరాన్ని చీరతో మాత్రమే కప్పుకోవటంవల్ల ఆమె కాళ్లు—మోకాళ్ళ నుంచి క్రిందకు కనుపిస్తూనే వున్నవి. చీరెను పట్టుకుని వక్షస్థలం మీదనున్న ఆమె చేతులు — మోచేతుల నుంచి క్రింది భాగాలు కనిపిస్తూనే వున్నవి. జుట్టు తడవకుండా ఉండగలందులకు పైకి ముడవటంవల్ల నున్నటి మెడ తళతళా మెరుస్తూవుంది. ఆమెకు తన అందం — ఆకర్షణ తెలుసు. దానిని ప్రదర్శించటం ఆమెకు తనివితీరని వాంఛ.

ఆమె అటువెళ్ళగానే ''సుందరి శరీరం మీరు చూసివుండరు. ఆమె ముఖంకంటె శరీరం ఎరుపెక్కువ. నునుపు కూడాను'' అన్నాడు జయరామారావు.

జయరామారావు తనని గురించే మాట్లాడుతున్నంతగా జలదరించి పోయింది కళ్యాణి. అప్రయత్నంగా ఆమె పమిటసర్దుకుంది. చీరను పాదాల మీదకు లాక్కుంది. చూపులు మరోవైపుకు తిప్పింది.

భగవంతుని దయవల్ల ''కళ్యాణీ: నీవు స్నానానికి వెళ్ళు'' అని కేక వేసింది సుందరి.

''వెళ్ళండి.'' అన్నాడు జయరామారావు చిరునవ్వు నవ్వుతూ.

"సబ్బు, తుండుగుడ్డ అన్నీ అక్కడ పెట్టాను. సీకాయి కావాలంటే గూట్లో వుంది. కొబ్బరినూనె సీసాలో వుంది." అని కేకవేసింది సుందరి.

ప్రాణాలను చిక్కబట్టుకుని, తడబడుతున్న నడకతో బైటపడింది కళ్యాణి. వెనుకనుంచి తన ప్రతి కదలికనూ జయరామారావు చూస్తున్నాడని ఆమె గ్రహించక పోలేదు.

(సశేషం)